పీహెచ్‌డీ తప్పనిసరి కాదు, అయినా..!

విశ్వవిద్యాలయాల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉద్యోగ నియామకాలకు పీహెచ్‌డీ అర్హత తప్పనిసరి కాదని యూజీసీ తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. నేషనల్ ఎలిజిబిలిటీ టెస్ట్ (నెట్), స్టేట్ ఎలిజిబిలిటీ టెస్ట్ (సెట్) .. ఉన్నత విద్యాసంస్థల్లో నేరుగా అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా నియమితులయ్యేందుకు ఈ పరీక్షల్లో ఉత్తీర్ణతను కనీస అర్హతగా గుర్తించనున్నారు. ఈ నిబంధనలు ఈ జులై 1 నుంచి అమల్లోకి వచ్చాయి. వీటి ప్రభావం గురించి నిపుణుల మాటల్లో..



పర్యవసానాలేంటి?

పోటీ ఎక్కువగా ఉన్నప్పుడు రిక్రూటర్లు పీహెచ్‌డీ, నెట్ రెండు అర్హతలూ ఉన్నవారిని ఎంపిక చేసుకునే అవకాశం ఉంది. ముఖ్యంగా ఇంటర్వ్యూల సమయంలో వందమంది ఒకే అర్హత ఉన్నవారు ఉంటే... అదనపు అర్హతలు ఉన్న పదిమందిని పిలిచే అవకాశం ఉంటుంది. అలాగే రిక్రూట్‌మెంట్ల సమయంలో స్కోర్ షీట్ తయారుచేస్తారు. ఇందులో నిబంధనల ప్రకారం పీహెచ్‌డీ ఉన్నవారికి 30 మార్కులు కేటాయిస్తున్నారు. కేవలం నెట్ అర్హతతో ఉద్యోగానికి ప్రయత్నించేవారికి ఈ 30 మార్కులు లభించే వీలుండదు. మొత్తంగా వచ్చే స్కోర్లలో పీహెచ్‌డీ ఉన్నవారు లేనివారికంటే అధిక మార్కులు సాధించే అవకాశం ఉంటుంది.

టాపర్లనే ఇంటర్వ్యూలకు పిలుస్తారు కాబట్టి పీహెచ్‌డీ లేని విద్యార్థులు వెనుకబడే ప్రమాదం ఉంది. యూజీసీ రెగ్యులేషన్స్ మార్చినప్పటికీ ఈ షీట్‌ను వారు మార్చలేదు, అది అలాగే ఉంది. ఇటువంటి సమయాల్లో పీహెచ్‌డీ లేని వారికి ఉద్యోగావకాశాలు తగ్గిపోతాయి.

ఇప్పుడు కాకపోయినా... కొన్ని రోజులకు మళ్లీ పీహెచ్‌డీ కచ్చితంగా ఉండాలనే నిబంధన పెట్టే అవకాశం కూడా లేకపోలేదు.

కప్పుడు అంటే 30, 40 ఏళ్ల క్రితం పోస్ట్ గ్రాడ్యుయేషన్ అర్హతతో విశ్వవిద్యాలయాల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా ఉద్యోగాలు లభించేవి. ఆ తర్వాత వీటికి బాగా పోటీ పెరిగిపోవడంతో కొంతకాలానికి ఎంఫిల్ అర్హతతో నియామకాలు చేపట్టేవారు. అలా కొన్నాళ్లు గడిచాక.. పీహెచ్‌డీ అర్హత ఉన్నవారిని ఉద్యోగాల్లోకి తీసుకోవడం ప్రారంభించారు. అనంతరం పీహెచ్‌డీ ఉన్న విద్యార్థుల సంఖ్య తక్కువైపోవడంతో యూజీసీ నెట్ ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులను పరిగణనలోకి తీసుకుంటూ వచ్చారు.

అప్పట్లో నెట్ క్వాలిఫై అయిన వారి సంఖ్య తక్కువగా ఉండేది, కానీ తర్వాత ఏడాదికి రెండుసార్లు ఈ పరీక్ష నిర్వహిస్తూ ఉండటంతో దీనిలో ఉత్తీర్ణులైనవారి సంఖ్య కూడా పెరిగి పెద్దయెత్తున పోటీ నెలకొంది. దీంతో 2018 నుంచి విశ్వవిద్యాలయాల్లో ఎంట్రీ లెవెల్ టీచింగ్ పోస్టులకు పీహెచ్‌డీని కనీస అర్హతగా యూజీసీ నిర్దేశించింది. అయితే అప్పటి ఉద్యోగార్థులు ఈ నిర్ణయంపై పునరాలోచించాలని యూజీసీని కోరారు. 'ఇప్పటికిప్పుడు పీహెచ్‌డీ అర్హత కావాలంటే మేమంతా ఉద్యోగావకాశాలు కోల్పోతామని, కనీసం సమయం ఇవ్వాల'ని కోరడంతో... వీరికి యూజీసీ 2023 జులై 1 వరకూ ఐదేళ్లపాటు అవకాశం కల్పించింది. అప్పటివరకూ పీహెచ్‌డీ లేకుండానే నియామకాలు చేపడతామని, ఈలోగా పూర్తిచేయాలని చెప్పింది.

అయితే ఇప్పుడు గడువు తీరిపోయినప్పటికీ అభ్యర్థులు పీహెచ్‌డీ తప్పనిసరి అనే నిర్ణయానికి అనుకూలంగా లేరు. ఎందుకంటే చాలా విశ్వవిద్యాలయాల్లో నియామకాలు లేవు. అందువల్ల పీహెచ్‌డీ చేయదలచిన విద్యార్థులకు మార్గం చూపించే గైడ్స్ లేరు. ఈ కారణంగా ఈ నిర్ణయంపై తిరిగి ఆలోచించాలనీ, పీహెచ్‌డీ అందుకోవాలంటే చాలా సమయం పడుతుండటం వల్ల నెట్ అర్హత ఉన్న తమకు అవకాశం ఇవ్వాలనీ అభ్యర్థులు కోరారు. కనీసం మరో అయిదేళ్లు గడువు పొడిగించాలని విన్నవించారు. దీంతో యూజీసీ ఈ ఉద్యోగాలకు నెట్‌ను కనీస అర్హతగా పరిగణిస్తూ, పీహెచ్‌డీ ఉన్నా లేకపోయినా పర్వాలేదని నిర్ణయించింది.

ఇప్పుడు విద్యార్థులు నెట్, పీహెచ్‌డీ- రెండింటితోనూ దరఖాస్తు చేసుకోవచ్చు. అయితే పీహెచ్‌డీ అర్హత ఉందని చూపేవారు... యూజీసీ నిబంధనలకు అనుగుణమైన చోట, అన్ని పరిమితులకూ లోబడి చేసిన పీహెచ్‌డీ కలిగి ఉండాలి. అప్పుడే దాన్ని పరిగణనలోకి తీసుకుంటారు. అంటే ఇప్పుడు నెట్ తప్పనిసరి, లేని పక్షంలో పీహెచ్‌డీ ఉన్నా పర్లేదని చెబుతున్నారు.

ఏది ఏమైనా యూనివర్సిటీల్లో బోధన వృత్తి చేపట్టదలచిన విద్యార్థులకు పీహెచ్‌డీ అర్హత చాలా ముఖ్యం. ఇంకో విషయం ఏమిటంటే.. అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు నెట్ అర్హత సరిపోయినా... అసిసోయేట్ ప్రొఫెసర్ కావాలంటే కచ్చితంగా పీహెచ్‌డీ కావాలి. ఇది గమనించక విద్యార్థులు నెట్ అర్హతతో ఉద్యోగంలో చేరిపోయి.. తర్వాత ప్రమోషన్లు రాక, ఉద్యోగాల్లో చేరాక పీహెచ్‌డీ చేసే వీలు లేక అక్కడితో ఆగిపోతుంటారు. ఇది వారి కెరియర్‌ను తీవ్రంగా దెబ్బతీస్తుంది. అందువల్ల ఉద్యోగాల్లో చేరే ముందే పీహెచ్‌డీతో చేరడం మంచిది.

నిజానికి ఇప్పుడు ప్రైవేటు వర్సిటీలు పెరిగాక పీహెచ్‌డీ ఉన్నవారు చాలా మంది మార్కెట్లో అందుబాటులో ఉన్నారు. అందువల్ల యూజీసీ రెగ్యులేషన్స్ మారినా.. రిక్రూట్‌మెంట్లు చేసే ఏజెన్సీలు పీహెచ్‌డీ, నెట్ రెండూ ఉన్నవారికి అధిక ప్రాధాన్యం ఇచ్చే అవకాశం ఉంటుంది. విద్యార్థులు ఈ నిబంధనలను పైపైన చూసి పీహెచ్‌డీని తేలిగ్గా తీసుకోకూడదు. అలాగే 'నెట్ కనీస అర్హత, పీహెచ్‌డీ కావాల్సిన అర్హత' అని చెప్పొచ్చు. అందువల్ల నెట్ ఉంది కదా అని పీహెచ్‌డీ అవసరం లేదనుకోకూడదు. పీహెచ్‌డీ కూడా ఉంటేనే అధిక అవకాశాలు అందుకోగలమనే విషయాన్ని గుర్తించాలి.

– ప్రొ. బెల్లంకొండ రాజశేఖర్,
స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్,
హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం

మిత్రులకు దూరంగా ఎలా?

డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్నా. కోరుకున్న కాలేజీలోనే సీటు వచ్చింది కానీ టెన్త్, ఇంటర్ స్నేహితులు లేకుండా కాలేజీకి వెళ్లాలని పించడం లేదు. ఈ మూడేళ్లూ ఎలా చదవాలో..? – మానస

■ డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్నారంటే మీ వయసు దాదాపు 18 ఏళ్లు ఉండొచ్చు. టెన్త్, ఇంటర్‌లలో మీతో చదువుకున్న స్నేహితులు/ స్నేహితురాళ్ళు వేర్వేరు కళాశాలల్లో చదువుతూ ఉండటమనేది చాలా సహజమైన విషయం. కానీ, మీరు స్నేహితులు లేకుండా కళాశాలకు ఎలా వెళ్లాలంటూ దిగులు పెట్టుకొని చదువుకు దూరమై, భవిష్యత్తునూ, సమయాన్నీ వృథా చేసుకొంటున్నారు.

జీవితమనే ప్రయాణంలో వివిధ సందర్భాల్లో వివిధ వ్యక్తుల్ని కలుస్తూ ఉంటాం. వీరిలో కొంతమందితో జీవిత కాలం ప్రయాణం చేయాలనిపిస్తుంది. మరికొందరిని మళ్లీ జీవితంలో కలవాలని అనుకోం. అదృష్టవశాత్తూ మీకు మంచి స్నేహితులు చిన్నతనంలోనే దొరికారు. మిత్రులు ఎప్పుడూ బలం కావాలి కానీ, బలహీనత కాకూడదు. కమ్యూనికేషన్ వ్యవస్థ ఇంతగా విస్తరించిన ఈ రోజుల్లో భౌతిక దూరం అనేది సమస్యే కాదు. ఫోన్‌తో నిమిషాల్లో కావాల్సినవారితో మాట్లాడొచ్చు.

మీరు, మీ స్నేహితులు వేర్వేరు కళాశాలల్లో చదవడం అనే విషయాన్ని ఒక సమస్యగా కాకుండా- ఓ మంచి అవకాశంగా భావించండి. మీరంతా అవకాశం ఉన్నప్పుడల్లా కలవడం, మీరు నేర్చుకొన్న విషయాలను చర్చించడం చేయొచ్చు.

జాగ్రత్తగా గమనిస్తే- మీ ప్రస్తుత కళాశాలలో కూడా మీ మనసుకు నచ్చిన మిత్రులు దొరికే అవకాశం ఉంది. ఈ కొత్త నేస్తాలతో మీ జీవితం ఇంకా ఆనందంగా ఉండొచ్చు. జీవితంలో స్నేహితులు ఒక భాగమే కానీ, జీవితమే స్నేహితులు కాదు. వాళ్లు లేరని మీరు కాలేజీకి వెళ్ళడం మానేస్తే, వాళ్లంతా బాగా చదువుకొని ప్రయోజకులై, భవిష్యత్తులో మిమ్మల్ని దూరం పెట్టే అవకాశం కూడా ఉంది. కొత్త కళాశాల, కొత్త పరిచయాలు, కొత్త జీవితాన్ని అనుభవంలోకి తీసుకొస్తాయి. మీ ఆలోచనా విధానంలో మార్పులు వచ్చి, జీవితంలో ఉన్నత స్థితికి చేరుకొన్నాక, ప్రస్తుతం మీరున్న ఈ స్థితిని గుర్తుకు తెచ్చుకొని మీరే నవ్వుకుంటారు!

జీవితం చాలా విలువైంది. తల్లిదండ్రులు మీపై ఎన్నో ఆశలు పెట్టుకొని వుంటారు. స్నేహితులూ, సినిమాలూ, సోషల్ మీడియా అని సమయం వృథా చేసుకోకుండా కోర్సుపై శ్రద్ధ పెట్టి జీవితానికి ఒక అర్థాన్ని కల్పించుకోండి. ఒకవేళ ఇంటర్ తరువాత అత్యుత్తమ విద్యాసంస్థలో మెడిసిన్/ఇంజినీరింగ్ చదివే అవకాశం వచ్చుంటే, మిత్రులు మీతో ఉండరని, ఆ అవకాశాల్ని కచ్చితంగా వదులుకునేవారు కాదు కదా?

జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలని బలంగా అనుకొంటే- మీ స్నేహితులూ, శ్రేయోభిలాషులూ ఎప్పుడూ మీతోనే, మీ మనసులోనే ఉంటారు. ఇవన్నీ అర్థం చేసుకొని, కళాశాలకు రోజూ వెళ్లి బాగా చదువుకోండి. కుటుంబానికీ, స్నేహితులకూ, గర్వకారణమయ్యేలా కృషి చేయండి.

నోటిఫికేషన్స్

ప్రభుత్వ ఉద్యోగాలు

ఎయిమ్స్ భువనేశ్వర్‌లో నాన్ ఫ్యాకల్టీ

ఒడిశా రాష్ట్రం భువనేశ్వర్‌లోని ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్.. 775 గ్రూప్ బి, సి (నాన్ ఫ్యాకల్టీ) ఖాళీల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తోంది.

ఖాళీలు: అసిస్టెంట్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్, అసిస్టెంట్ ఇంజినీర్, చీఫ్ క్యాషియర్, సీఎస్ఎస్‌డీ టెక్నీషియన్, డైటీషియన్, గ్యాస్ ఆఫీసర్, హెల్త్ ఎడ్యుకేటర్, జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్, జూనియర్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ తదితరాలు.

అర్హత: పదో తరగతి, సంబంధిత విభాగంలో ఐటీఐ, 10+2, డిప్లొమా, డిగ్రీ, పీజీ.

ఎంపిక: కంప్యూటర్ బేస్డ్ టెస్ట్, స్కిల్ టెస్ట్/ కంప్యూటర్ ప్రొఫిషియన్సీ టెస్ట్ ఆధారంగా.

దరఖాస్తు రుసుము: అన్‌రిజర్వ్‌డ్/ ఓబీసీ అభ్యర్థులకు రూ.3000. ఎస్సీ/ ఎస్టీ/ ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు రూ.2400. దివ్యాంగ అభ్యర్థులకు ఫీజు మినహాయింపు ఉంటుంది.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఎంప్లాయిమెంట్ న్యూస్‌లో ఉద్యోగ ప్రకటన ప్రచురితమైన తేదీ నుంచి 30 రోజుల్లోగా.

వెబ్‌సైట్: https://aiimsbhubaneswar.nic.in/

రెప్కో మైక్రో ఫైనాన్స్ లిమిటెడ్-చెన్నైలో..

చెన్నైలోని నాన్ బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కార్పొరేషన్ (ఎన్‌బీఎఫ్‌సీ) ఆధ్వర్యంలోని రెప్కో మైక్రో ఫైనాన్స్ లిమిటెడ్ (ఆర్ఎంఎఫ్ఎల్) 140 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- సీనియర్ మేనేజర్: 10
- మేనేజర్: 10
- డిప్యూటీ మేనేజర్: 35
- అసిస్టెంట్ మేనేజర్: 35
- అడ్మిన్ అసిస్టెంట్: 50

అర్హత: పోస్టును అనుసరించి గ్రాడ్యుయేషన్.

వయసు: 28-35 ఏళ్లు ఉండాలి.

జీతభత్యాలు: ఏటా రూ.3.5 లక్షలు- రూ.8 లక్షలు.

ఎంపిక: షార్ట్‌లిస్టింగ్, రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా.

దరఖాస్తు ఫీజు: రూ.500.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 19.07.2023.

వెబ్‌సైట్:
https://www.repcomicrofin.co.in/careers.php

వీఎస్ఎస్‌సీ-తిరువనంతపురంలో సైంటిస్ట్ ఖాళీలు

తిరువనంతపురంలోని ఇస్రో ఆధ్వర్యంలో ఉన్న విక్రమ్ సారాభాయ్ స్పేస్ సెంటర్ (వీఎస్ఎస్‌సీ) 66 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టులు: సైంటిస్ట్/ ఇంజినీర్ (ఎస్‌డీ, ఎస్‌సీ).

విభాగాలు: స్పేస్ సైన్స్, ప్లానెటరీ సైన్స్, ఎక్స్‌పరిమెంటల్ కోల్డ్ ఆటమ్స్, అప్లైయిడ్ మెకానిక్స్, మెషిన్ డిజైన్, ప్రపల్షన్ ఇంజినీరింగ్, ఏరోస్పేస్ ఇంజినీరింగ్, కెమిస్ట్రీ, కంట్రోల్ గైడెన్స్ అండ్ నేవిగేషన్, సిస్టమ్స్ ఇంజినీరింగ్, పవర్ ఎలక్ట్రానిక్స్, ప్రొడక్షన్ ఇంజినీరింగ్ తదితరాలు.

1. సైంటిస్ట్/ ఇంజినీర్(ఎస్‌డీ): సంబంధిత స్పెషలైజేషన్‌లో పీహెచ్‌డీ.
జీతభత్యాలు: నెలకు రూ.67700-రూ.208700.
2. సైంటిస్ట్/ ఇంజినీర్ (ఎస్‌సీ): సంబంధిత స్పెషలైజేషన్‌లో బీఈ/ బీటెక్/ ఎంఈ/ ఎంటెక్.
జీతభత్యాలు: నెలకు రూ.56100-రూ.177500.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 21.07.2023.

వెబ్‌సైట్: https://www.vssc.gov.in/careers.html

హైదరాబాద్‌లో ల్యాబ్ అటెండెంట్ పోస్టులు

హైదరాబాద్‌లోని ఐసీఎంఆర్- నేషనల్ యానిమల్ రిసోర్స్ ఫెసిలిటీ ఫర్ బయోమెడికల్ రిసెర్చ్ (ఎన్ఏఆర్ఎఫ్‌బీఆర్).. డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ద్వారా 46 పోస్టుల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తోంది.

- టెక్నికల్ అసిస్టెంట్: 03
- టెక్నీషియన్-1: 08
- ల్యాబ్ అటెండెంట్-1: 35

అర్హతలు: ఖాళీని అనుసరించి పదో తరగతి, ఇంటర్మీడియట్, డిప్లొమా, బ్యాచిలర్ డిగ్రీతో పాటు పని అనుభవం ఉండాలి.

వయసు: టెక్నికల్ అసిస్టెంట్‌కు 30 ఏళ్లు; టెక్నీషియన్‌కు 28 ఏళ్లు; ల్యాబ్ అటెండెంట్‌కు 25 ఏళ్లు మించకూడదు.

ఎంపిక: రాత పరీక్ష ఆధారంగా.

దరఖాస్తు: ఆఫ్‌లైన్ దరఖాస్తును 'డైరెక్టర్, ఎన్ఏఆర్ఎఫ్‌బీఆర్, జీనోమ్ వ్యాలీ, కొల్తూర్ (పోస్టు), శామీర్‌పేట్ (మ), హైదరాబాద్' చిరునామాకు పంపించాలి.

దరఖాస్తుకు చివరి తేదీ: 14.08.2023.

వెబ్‌సైట్: https://narfbr.org/

అప్రెంటిస్‌షిప్

హెచ్‌సీఎల్-బాలాఘట్‌లో 184 అప్రెంటిస్ ఖాళీలు

మధ్యప్రదేశ్‌లోని బాలాఘట్‌కు చెందిన హిందుస్థాన్ కాపర్ లిమిటెడ్ (హెచ్‌సీఎల్) ఆధ్వర్యంలోని మలాంజ్‌ఖండ్ కాపర్ ప్రాజెక్ట్ 184 ట్రేడ్ అప్రెంటిస్ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- మేట్, బ్లాస్టర్, ఫిట్టర్, టర్నర్, వెల్డర్, ఎలక్ట్రీషియన్, కంప్యూటర్ ఆపరేటర్, సర్వేయర్, మాసన్, హార్టికల్చర్ అసిస్టెంట్ తదితరాలు.

విభాగాలు: మైన్స్, డీజిల్, గ్యాస్, ఎలక్ట్రిక్, సివిల్, మెకానికల్ తదితరాలు.

అర్హత: సంబంధిత స్పెషలైజేషన్‌లో టెన్త్/ 10+2/ ఐటీఐ.

వయసు: 18-25 ఏళ్లు ఉండాలి.

ఎంపిక: మెరిట్, ఫిజికల్ ఫిట్‌నెస్ ఆధారంగా.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 05.08.2023.

వెబ్‌సైట్:
https://www.hindustancopper.com/Page/Career_New

తాజా ఇంటర్నషిప్‌లు

వర్క్ ఫ్రమ్ హోమ్

సోషల్ మీడియా ఆప్టిమైజేషన్
సంస్థ: డిజిటల్ అమిగోస్
స్టైపెండ్: నెలకు రూ.3,000
దరఖాస్తు గడువు: జులై 20
అర్హతలు: ఫేస్‌బుక్ యాడ్స్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ మార్కెటింగ్ నైపుణ్యాలు
internshala.com/i/97cb5c

డేటా ఇంజినీరింగ్
సంస్థ: డిజిటల్ ఆల్ఫా
స్టైపెండ్: నెలకు రూ.20,000
దరఖాస్తు గడువు: జులై 20
అర్హతలు: అమెజాన్ వెబ్ సర్వీసెస్ నైపుణ్యం
internshala.com/i/32cf55

కోఆర్డినేషన్
సంస్థ: అడోర్ ఎర్త్
స్టైపెండ్: నెలకు రూ.1,500
దరఖాస్తు గడువు: జులై 20
అర్హతలు: ఇంగ్లిష్ నైపుణ్యం
internshala.com/i/ba9b79

హైదరాబాద్‌లో

ఇండస్ట్రియల్ డిజైన్ ఇంజినీరింగ్
సంస్థ: టెకొల్యూషన్
స్టైపెండ్: నెలకు రూ.15,000
దరఖాస్తు గడువు: జులై 20
అర్హతలు: సంబంధిత నైపుణ్యం, ఆసక్తి
internshala.com/i/289314

ఫ్రంట్ ఆఫీస్ ఆపరేషన్స్
సంస్థ: ఫ్యూచర్ స్కిల్స్
స్టైపెండ్: నెలకు రూ.10,000
దరఖాస్తు గడువు: జులై 20
అర్హతలు: ఎఫెక్టివ్ కమ్యూనికేషన్
internshala.com/i/76852b

'నాయకత్వం, నేర్చుకోవడం... వీటిలో ఒకదానికొకటి తప్పనిసరి' (నేర్చుకునే తపన లేనివాడు నాయకుడు కాలేడు)
- జాన్ ఎఫ్ కెన్నెడి

విదేశీ వర్సిటీల్లో.. ఉచితంగా నేర్చుకుందాం!

విదేశాలకు వెళ్లి చదవాలనీ, నాణ్యమైన విద్యా బోధనను అందుకోవాలనీ చాలామంది విద్యార్థులు అనుకుంటారు. కానీ రకరకాలైన కారణాల వల్ల వెళ్లలేకపోతుంటారు. ఫీజు ఎక్కువనే భయం ఉండనే ఉంది. కానీ అక్కడికి వెళ్లకుండానే ఆ యూనివర్సిటీల్లో చదివే అవకాశం ఉందని చాలా మందికి తెలియదు. ఆన్‌లైన్ ద్వారా ఈ సంస్థల్లో వివిధ కోర్సులు చేయవచ్చు. ఆ వివరాలేంటో చూద్దామా!

ప్రఖ్యాతిగాంచిన విదేశీ యూనివర్సిటీలు ప్రపంచవ్యాప్తంగా ఉన్న విద్యార్థులందరి కోసం కొన్ని ఉచిత ఆన్‌లైన్ కోర్సులను అందిస్తున్నాయి. ఇవి వారి విద్యాసంస్థల్లో ప్రమాణాల స్థాయిని పరిచయం చేయడమే కాకుండా... విద్యార్థులు ప్రాథమిక అంశాలపై పట్టు సాధించేందుకు పనికొస్తాయి. ఇటువంటి కోర్సుల్లో చేరిన విద్యార్థులు తమకు నచ్చిన విభాగాల్లో ప్రాథమికాంశాలు ఉచితంగా నేర్చుకోవచ్చు. అంతేకాదు, విదేశీ విశ్వవిద్యాలయం నుంచి చదివామన్న తృప్తీ లభిస్తుంది, జాబ్ మార్కెట్‌లో మంచి అవకాశాలూ అందుకోవచ్చు. ఇవి అధికశాతం ఆన్‌లైన్ లెర్నింగ్ ప్లాట్‌ఫామ్స్‌తో అనుసంధానమై పనిచేస్తున్నాయి. అంటే సంబంధిత వర్సిటీ అధ్యాపకులే ఈ ప్లాట్‌ఫామ్స్ ద్వారా బోధిస్తారన్నమాట.

హార్వర్డ్ యూనివర్సిటీ

ఐవీ లీగ్‌లో ముఖ్యమైన, పురాతనమైన వర్సిటీ ఇది. దాదాపు 600లకు పైగా కోర్సులను విద్యార్థులకు ఉచితంగా అందిస్తోంది. ఉన్నత స్థాయి ప్రమాణాలతో, తమ విద్యాబోధన ఎలా ఉంటుందనే విషయం తెలిసేలా ఈ కోర్సులు ఉంటాయి. ఇవి ఒకటి నుంచి పన్నెండు వారాల వ్యవధితో లభిస్తాయి. సాహిత్యం, లా, బిగ్‌డేటా, సామాజిక అంశాలు, వ్యక్తిత్వ వికాసం, నాయకత్వ లక్షణాలు, ప్రోగ్రామింగ్, గేమ్ డెవలప్‌మెంట్, చరిత్ర, న్యూరోసైన్స్.. ఇలా విభిన్న అంశాలను నేర్చుకునే వీలుంది. ఇవేకాక ఆధునిక సాంకేతిక కోర్సులైన మెషిన్ లెర్నింగ్, పైతాన్ లాంగ్వేజ్, గేమ్ డెవలప్‌మెంట్, డేటా సైన్స్ వంటి వాటిలోనూ ప్రాథమిక అంశాలు నేర్చుకోవచ్చు.

జార్జియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ

మాసివ్ ఓపెన్ ఆన్‌లైన్ కోర్సెస్ - మాక్స్ ద్వారా ఈ విద్యాసంస్థ ఆన్‌లైన్ కోర్సులను అందిస్తోంది. అప్పటి నుంచి ముప్పై లక్షల మందికిపైగా విద్యార్థులు ఈ సౌకర్యాన్ని వినియోగించుకున్నారు. అంతేకాదు.. ఇవన్నీ వివిధ ర్యాంకింగ్ సిస్టమ్స్‌లో పోటీ పడి టాప్ ర్యాంకులు పొందిన కోర్సులు. ఈ కాలేజ్ అందించే మొత్తం 30 కోర్సుల్లో బిజినెస్, కంప్యూటింగ్, ఇంజినీరింగ్, మేనేజ్‌మెంట్, మ్యాథమెటిక్స్, సప్లైచెయిన్ అండ్ లాజిస్టిక్స్ అనే విభాగాలు ఉన్నాయి. వీటిలో డేటా అనలిటిక్స్, ఇన్ఫర్మేషన్ అండ్ కమ్యూనికేషన్, యూఎక్స్ డిజైన్, డేటా అనాలిసిస్, హెల్త్ ఇన్ఫర్మేటిక్స్, పైతాన్, జావా, డేటా స్ట్రక్చర్స్ అండ్ అల్గారిదమ్స్, మెకానిక్స్, మెటీరియల్స్, ఎలక్ట్రానిక్స్, మెషిన్ డిజైన్, అనలిటిక్స్ మోడలింగ్, స్టాటిస్టిక్స్, ఇన్నోవేషన్ లీడర్‌షిప్, సప్లై చెయిన్ ప్రిన్సిపల్స్.. వంటి అనేక అంశాలు చదివే వీలుంది. ఎడ్ఎక్స్, కోర్సెరా, ఉడాసిటీ వంటి ప్లాట్‌ఫామ్స్ ద్వారా వీటికి ఉచితంగా రిజిస్టర్ చేసుకోవచ్చు.

మిషిగాన్ స్టేట్ యూనివర్సిటీ

ఫొటోగ్రఫీ, మ్యూజిక్, గేమ్ డెవలప్‌మెంట్, స్క్రిప్ట్ రైటింగ్, మైండ్‌వేర్, జర్నలిజం, రైటింగ్, పిక్సల్ ఆర్ట్, క్రియేటివిటీ, బిజినెస్ వంటి కోర్సులు చేయవచ్చు. గమనిస్తే... ఈ వర్సిటీ అందించేవన్నీ సంప్రదాయ చదువులకు భిన్నంగా ఉండే మార్గాలే! వీటి గురించి తెలుసుకోవాలనుకునే విద్యార్థులకు సులభంగా సమాచారం దొరికేలా ఈ ప్రోగ్రామ్స్‌ను అందుబాటులో ఉంచారు. ఇవి పూర్తి చేసిన తర్వాత కంప్లీషన్ సర్టిఫికెట్ లభిస్తుంది. వారానికి ఎన్నిగంటలు కావాలో అలా చదువుకునే వీలుంటుంది. దాదాపుగా 6 నెలల్లో పూర్తిచేయవచ్చు.

యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ లండన్

యూకేలో ఉన్న టాప్ కాలేజీల్లో ఇదీ ఒకటి. ఇటీవల విడుదల చేసిన క్యూఎస్ వరల్డ్ యూనివర్సిటీ ర్యాంకింగ్స్‌లో ఎనిమిదో స్థానంలో ఉంది. ఇందులో ఆంత్రొపాలజీ, సిటిజన్ సైన్స్, కల్చర్, హెల్త్... ఇలా 170కి పైగా ప్రోగామ్స్ ఆన్‌లైన్‌లో చదవొచ్చు. దాదాపుగా ఉచితంగా లభిస్తాయి. కొన్ని ప్రత్యేక ప్రోగామ్స్‌కి మాత్రం ఫీజు చెల్లించాలి.

కాలిఫోర్నియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ది ఆర్ట్స్

ఈ ఆర్ట్స్ కాలేజీ నుంచి విద్యార్థులు స్పెషలైజ్డ్ ప్రోగ్రామ్స్ చేసే వీలుంది. క్రెడిట్స్, సర్టిఫికెట్స్ కావాలంటే ఫీజు చెల్లించాలి. ఫ్రీలాన్సింగ్ బిజినెస్, గేమ్ డిజైన్, గ్రాఫిక్ డిజైన్, మ్యూజిక్ థియరీ - టెక్నాలజీ, పొయిట్రీ, యూఐ/యూఎక్స్ డిజైన్, వెబ్ డిజైన్ వంటి ప్రోగామ్స్‌ను కోర్సెరా ప్లాట్‌ఫామ్ నుంచి చేయవచ్చు.